క్లుప్తంగా

బీజేపీ లీగల్ సెల్ మెంబర్‌గా సద్గుణరెడ్డి



మోతీనగర్: బీజేపీ లీగల్ సెల్ మెంబర్‌గా కూకట్‌పల్లి అసెంబ్లీకి చెందిన సద్గుణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి ఉమశంకర్ పార్టీ కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసి పదవికి పూర్తి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విద్యార్థులతో భగత్‌సింగ్ ఆలోచనలు, ఆశయాలపై చర్చించారు. విద్యార్థులకు సమాజంలో ఉన్న ప్రతి సమస్యపైనా పోరాడాలని భగత్‌సింగ్ ఆశయాలను గుర్తు పెట్టుకొని సమాజం కోసం పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్ చౌహాన్, జిల్లా నాయకులు సుమంత్, వంశీ భరత్ తదితరులు పాల్గొనానరు.

లెనిన్ క్లబ్ క్లాత్ స్టోర్ ప్రారంభం



కార్పొరేటర్‌ఐ వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న ఆంజనేయులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో లలు మాల్ సెంటర్‌లో లెనిన్ క్లబ్ క్లాత్ స్టోర్‌ను బుధవారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లెనిన్ క్లబ్ ఫ్రాంచైజీ యజమాని పీఎస్‌ఆర్ ఆంజనేయులు, ఇమ్మని చిన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

బాలానగర్: ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మూడు రోజులుగా బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆశావర్కర్లకు మద్దతుగా బుధవారం సీఐటీయూ నాయకులు ఐలాపురం రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్లను కట్టు బానిసలుగా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యూనియన్ నాయకులు, ఆశావర్కర్లతో కలిసి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా ఆశావర్కర్‌గా పనిచేస్తున్న వారికి కనీస వేతనం అందడం లేదన్నారు. ఆశావర్కర్లకు ఇంటింటికీ తిరిగి సర్వేలు చేస్తుంటే అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం టూ వీలర్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు అనిత, మౌనిక, వినోద, సౌభాగ్య, కళ్యాణి, అశ్విని, సరళ పాల్గొన్నారు.

గణనాథుడికి ఘన పూజలు

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 10వ రోజు మండపాలలో గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మండపాల్లోని వినాయకులను వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. పదో రోజు వినాయకులను నిమజ్జనం చేసేందుకు గంగమ్మ ఒడికి తరలించారు.

– కూకట్‌పల్లి



ఫతేనగర్ పంచాయితీ కార్యాలయం వద్ద గణపతికి పూజలు చేసిన కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్



వివేకానందనగర్ వినాయక మండపంలో వేలం పాటలో రూ.3.20 లక్షలకు దక్కించుకున్న కవ్వూరి చంద్రశేఖర్ నాగసుందరి దంపతులు



సమతా నగర్‌లోని వినాయక మండపంలో పూజలు చేసిన స్థానికులు



భరత్‌నగర్ కాలనీ శివసేన గ్రౌండ్‌లోని గణపతి పూజలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్



బాలనగర్ డివిజన్‌లో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



తులసీనగర్‌లోని వినాయక మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సామ కొండల్‌రెడ్డి



శ్రీవివేకానందనగర్‌లో లడ్డూను రూ.1,15,116 కు దక్కించుకున్న రవికుమార్ దంపతులు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆల్విన్‌కాలనీ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్



భాగ్యనగర్‌కాలనీ పద్మావతి ప్లాజాలో ప్రసాదం పూజల్లో పాల్గొన్న భక్తులు



అంజయ్యనగర్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు



వినాయకుడి పూజలో యూత్ అసోసియేషన్ సభ్యులు



ఫతేనగర్‌లో గణనాథుని దర్శించుకున్న కార్పొరేట్ పండాల సతీష్ గౌడ్ తదితరులు



రిటైల్ మార్కెట్‌లో గణపతి హోమం చేస్తున్న మక్కాల సత్యనారాయణ



హస్మత్‌పేట చత్రిగడ్డ వినాయకుడి పూజలో పాల్గొన్న స్థానిక నాయకులు



రిటైల్ మార్కెట్‌లో అన్నం వడ్డిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కూకట్‌పల్లి: బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత, ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, రవీందర్ ముదిరాజ్‌లతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ సాధన కోసం తన జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ గర్వించే గొప్ప నేత అని అన్నారు. ఉద్యమకారుడిగా, ప్రజాస్వామిక వాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం రేపటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, జిల్లా గణేష్, కాశీనాథ్‌యాదవ్, లక్ష్మీనారాయణ, నరేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట: మూసాపేటలో మూసాపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాడం కృష్ణ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి బుధవారం నిర్వహించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్మంలో నాయకులు అంబటి శ్రీనివాస్, పంచశీల శ్రీనివాస్, ఆగమయ్య, గూడ శ్రీనివాస్, బుచ్చి రాములు, ఎంబ కృష్ణ, బోగా విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని జోనల్ కార్యాలయంలో బుధవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వి. మమత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాడం కృష్ణ



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్‌సీ మమత

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా విడుదలైన రూ.2లక్షల చెక్కును బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహంకాళీనగర్‌కు చెందిన సురేష్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రావు, కాశీనాథ్‌యాదవ్, పోచయ్య, కృష్ణరావు, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు గుర్రం ప్రభాకర్ మృతి



గుర్రం ప్రభాకర్ (ఫైల్)

కూకట్‌పల్లి: మలి విడత తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన తెలంగాణ ఉద్యమకారుడు గుర్రం ప్రభాకర్ (58) మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రారంభించిన సమయంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ స్వగృహంలో దివంగత బీఆర్‌ఎస్ నాయకుడు ఎం. సుదర్శన్‌రావు సమక్షంలో బీఆర్‌యస్ పార్టీలో చేరారు. అనంతరం ఏర్పడిన తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలో సైతం చేరిన గుర్రం ప్రభాకర్ రిలే నిరాహార దీక్షలు, సాగర హారం, సమర దీక్ష, మిలియన్ మార్చ్, సహాయ నిరాకరణ, వంటా వార్పు, ధూం ధాం లాంటి కార్యక్రమంలో కీలకంగా పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. గుర్రం ప్రభాకర్ అంత్యక్రియలు ఈఎస్‌ఐలోని హిందూ శ్మశానవాటికలో నిర్వహించారు.

చెట్ల కొమ్మలు తొలగిస్తుండగా విద్యుదాఘాతం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- విద్యుత్ సరఫరా నిలిపేయకుండా కొమ్మల తొలగింపు
- సంబంధిత అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం

మూసాపేట్: డివైడర్ మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్పల్లి పీఎస్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా త్రిపురారం గ్రామానికి చెందిన జి. నరేష్ (39) ట్రాన్స్‌కోలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మేడిపల్లిలో నివాసం ఉంటున్న అతడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. హెచ్‌ఎంటీ శాతవాహననగర్‌లో డివైడర్ మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలను పది మంది కలిసి తొలగిస్తూ ఉన్నారు. ఇద్దరు ఒక చెట్టుపై ఉండగా నరేష్ మరో చెట్టుపై ఉండి చెట్టు కొమ్మలను తొలగిస్తున్నారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లకి దగ్గరగా వెళ్లడంతో..

◆ తలకు గాయం కావడంతో వెంటనే స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు తెలిపారు. విద్యుత్ చెట్ల కొమ్మలు తొలగిస్తున్నప్పుడు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేసి విధులు నిర్వహిస్తారు. కానీ విద్యుత్ సరఫరా నిలిపి వేయకుండా పనులు చేస్తుండటంతో ప్రమాదం జరిగిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశాం

- పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అక్టోబర్ 3న ప్రగతి నివేదన సభకు మంత్రి కేటీఆర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి 44వ రోజు పాదయాత్రను బుధవారం కొనసాగించారు. కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని డ్రీమ్ వ్యూ కాలనీ, విశ్వంభరా, శ్రీలపార్కు, బుద్ధ వర్టెక్స్, శిల్ప, గోపాల్ నగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి కాలనీ అసోసియేషన్‌లో విభిన్న రకాల పార్కులను రూపకల్పన చేశామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడికక్కడ ఇండోర్ స్టేడియాలు, వాకి టాకీలు నిర్మించడమే కాకుండా వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలైన రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సమస్యలను తీరుస్తున్నామన్నారు.

◆ ప్రజలకు అందుబాటులో ఉంటూ కుల మత ప్రాంతాల కతీతంగా అందరూ కలిసి మెలిసి ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే కాకుండా పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారన్నారు.

◆ అందుకే ప్రపంచ కుబేరులందరూ హైదరాబాద్ మహానగరాన్ని పెట్టుబడులకు అనుకూల నగరంగా చూసుకుంటున్నారని గుర్తు చేశారు. మరికొన్ని రోజుల్లో పాదయాత్ర ముగుస్తుందని అనంతరం అక్టోబర్ 3న కేపీహెచ్‌బీలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా ప్రగతి నివేదన సభ జరుగుతుందని పేర్కొన్నారు.



కేపీహెచ్‌బీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి





పాదయాత్రలో స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నిమజ్జన శోభ

హస్మత్‌పేట్‌లోని బోయిన్ చెరువు వద్ద నిమజ్జన కోలాహలం కొనసాగుతోంది. ఈ చెరువులో ఇప్పటి వరకు చిన్న గణపతులను 4వేలు, పెద్ద వినాయకులను 500 వరకు నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. గురువారం, శుక్రవారం మొత్తం 2వేల వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగనుందని పేర్కొన్నారు. నిమజ్జనం తీరుతెన్నులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా మొబైల్ జనరేటర్లతో పాటు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

– ఓల్డ్‌బోయిన్‌పల్లి







